

## పొన్నం.. గాంధీభవన్ వద్ద దీక్ష చేయ్..

- రైతులకు పరిహారం ఎందుకు ఇవ్వరు..?
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్

- వివరాలు 3లో..



## బీఆర్ఎస్‌కు.. కరీంనగర్ పుట్టినిల్లు..

- రేవంత్ ఏమైనా చెడ్డి గ్యాంగ్ సభ్యుడా..?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

- వివరాలు 5లో..

TELANGANA CAPITAL సంపుటి 01 | సంచిక 05

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

కాంప్లిమెంటరీ కాపీ | కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల | శనివారం 13 ఏప్రిల్ 2024 | పేజీలు 5



2

- అందినకాడికి దోచుకుంటున్న కార్పొరేట్ హాస్పిటల్స్
- చిన్న జ్వరం వచ్చినా టెస్టుల మీద టెస్టులు
- ఎమర్జెన్సీ కేసైతే అందినకాడికి గుంజుడే..
- పేషెంట్లు మరణించినా దయ చూపని యాజమాన్యాలు
- ఫీజు చెల్లించాకే శవాన్ని పంపిస్తామంటూ డిమాండ్
- కాళ్లావేళ్లా పడ్డా కనికరించని వైనం

## అందని ప్రభుత్వ వైద్యం..
# ప్రైవేటుకు వరం

(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ బ్యూరో)

అమ్మా..నాన్న.. గురువు.. ఆ తరువాత వైద్యులను దేవుళ్లతో పోలుస్తుంటాం. వైద్యో నారాయణ హరి అని అంటుంటాం. అలాంటి దైవంతో పోలించబడుతున్న వైద్యులు.. ప్రజల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్నారు. సామాన్యుల జేబులు గుల్ల చేసేస్తున్నారు. హైదరాబాద్ తర్వాత కరీంనగర్‌లోనే కార్పొరేట్ హాస్పిటల్ జోన్ ఉంది. పేరుకు స్పెషలిస్టులు.. పేరుకు కార్పొరేట్ హాస్పిటల్స్ అయినప్పటికీ ఆ స్థాయిలో వైద్యం మాత్రం అందడం లేదు. కానీ.. వైద్యం పేరిట మాత్రం వైద్యానికి వచ్చిన రోగులను మాత్రం ముప్పు తిప్పలు పెడుతున్నట్లు సమాచారం. కాసులకు కక్కుర్తి పడి కొందరు ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలు తమ పీఆర్వోలు, గ్రామాల్లోని ఆర్ఎంపీలు.. పీఎంపీలతో పెద్ద ఎత్తున దందాను కొనసాగిస్తున్నారు. ఇక.. చిన్నపాటి జ్వరం వచ్చినా.. రోగికి అవసరం లేకున్నా రక్త పరీక్షలు.. స్కానింగ్ చేయిస్తున్నారు. దీనికి తోడు వైద్యాన్ని ఆసరాగా చేసుకుని అనుమతులు లేని ప్రైవేట్ హాస్పిటల్స్ నిర్వహిస్తూ అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైద్యం పేరుతో సామాన్యుల జేబులు గుల్ల చేస్తున్నా సంబంధిత అధికారులు వైద్య ఆరోగ్య శాఖ మాత్రం పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



## ఉద్రిక్తతల మధ్య
# భూమి పూజ

### రోడ్డు పైనే గ్రామస్తులు
### ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ డిమాండ్

4

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని నర్సింహులపల్లి శివారు ప్రాంతంలో 18 ఏకరాలలో ఏర్పాటు చేసే వైట్ హౌస్ ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులలో భాగంగా శుక్రవారం భూమి పూజ కార్యక్రమం పోలీసుల బందో బస్తు మధ్య, ఉద్రిక్తలతో కొనసాగింది. భూమి పూజ నిర్వహిస్తున్నారని తెలుసుకున్న పలువురు గ్రామస్తులు పిల్లాపాపలతో ఫ్యాక్టరీ ఆవరణకు మూకుమ్మడిగా చేరుకున్నారు. పోలీసులు ఫ్యాక్టరీ ఆవరణకు ఎవరినీ రాకుండా అడ్డుకున్నారు. దాంతో వారంతా రోడ్డుపైనే ఉండిపోవాల్సి వచ్చింది. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య భూమి పూజ కార్యక్రమం ఫ్యాక్టరీ డైరెక్టర్ నరేష్ కుమార్ దంపతులు నిర్వహించారు. మరోవైపు.. రోడ్డుపై మహిళలు ఎంత మొరపెట్టుకున్నా పోలీసులు వినిపించుకోలేదు. - తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి

## ఎన్నికల రూల్స్ పకడ్బందీగా
# అమలు చేయాలి

కమిషనరేట్ స్థాయి నేర సమీక్షలో సీపీ అభిషేక్ మహంతి

- వివరాలు 5లో..

GENERAL SPECIAL

# అందని ప్రభుత్వ వైద్యం.. ప్రైవేట్ ఆస్పత్రులకు వరం

అందినకాడికి దోచుకుంటున్న కార్పొరేట్ హాస్పిటల్స్

చిన్న జ్వరం వచ్చినా టెస్టుల మీద టెస్టులు

ఎమర్జెన్సీ కేసైతే అందినకాడికి గుంజుడే..

పేషెంట్లు మరణించినా దయ చూపని యాజమాన్యాలు

ఫీజు చెల్లించాకే శవాన్ని పంపిస్తామంటూ డిమాండ్

కాళ్లావేళ్లా పడ్డా కనికరించని వైనం



(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ బ్యూరో)

అమ్మా..నాన్న.. గురువు.. ఆ తరువాత వైద్యులను దేవుళ్లతో పోలుస్తుంటాం. వైద్యో నారాయణ హరి అని అంటుంటాం. అలాంటి దైవంతో పోలించబడుతున్న వైద్యులు.. ప్రజల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్నారు. సామాన్యుల జేబులు గుల్ల చేసేస్తున్నారు. హైదరాబాద్ తర్వాత కరీంనగర్‌లోనే కార్పొరేట్ హాస్పిటల్ జోన్ ఉంది. పేరుకు స్పెషలిస్టులు.. పేరుకు కార్పొరేట్ హాస్పిటల్స్ అయినప్పటికీ ఆ స్థాయిలో వైద్యం మాత్రం అందడం లేదు. కానీ.. వైద్యం పేరిట మాత్రం వైద్యానికి వచ్చిన రోగులను మాత్రం ముప్పు తిప్పలు పెడుతున్నట్లు సమాచారం. కాసులకు కక్కుర్తి పడి కొందరు ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలు తమ పీఆర్వోలు, గ్రామాల్లోని ఆర్‌ఎంపీలు.. పీఎంపీలతో పెద్ద ఎత్తున దందాను కొనసాగిస్తున్నారు. ఇక.. చిన్నపాటి జ్వరం వచ్చినా.. రోగికి అవసరం లేకున్నా రక్త పరీక్షలు.. స్కానింగ్ చేయిస్తున్నారు. దీనికి తోడు వైద్యాన్ని ఆసరాగా చేసుకుని అనుమతులు లేని ప్రైవేట్ హాస్పిటల్స్ నిర్వహిస్తూ అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైద్యం పేరుతో సామాన్యుల జేబులు గుల్ల చేస్తున్నా సంబంధిత అధికారులు వైద్య ఆరోగ్య శాఖ మాత్రం పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

## ఎమర్జెన్సీ అయితే అంతే..

ఇక ఎమర్జెన్సీ కేసైతే అందినకాడికి గుంజుతున్నారు. పరిస్థితి విషమించి పేషెంట్లు మరణించిన సందర్భాల్లోనూ ఫీజు కట్టాలని బాధితులను డిమాండ్ చేస్తుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులను గొప్పగా తీర్చిదిద్దుతున్నామని పాలకులు చెప్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం అది కానరావడం లేదు. కొన్నిచోట్ల సరైన బిల్డింగ్స్ కూడా లేక పాత బిల్డింగ్స్‌లోనే వైద్యశాలలు రన్ చేస్తున్నారు. పైనుంచి పెచ్చులు ఊడిపడుతున్నా అటు వైపు చూసే వారు కరువయ్యారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన సౌలతులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండటం లేదు. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే వైద్యుల నిర్లక్ష్యం అంతా ఇంత ఉండదని పేషెంట్లు వాపోతున్నారు. ఎమర్జెన్సీ కేసు అయినా పట్టించుకోరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేషెంట్ల రూంలలో శుభ్రత అనేదే ఉండదని ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందని ప్రజలు అంటున్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రులకు వరం

ప్రజలకు ఉచిత వైద్యం ఇవ్వాల్సిన ప్రభుత్వాలే ప్రభుత్వ వైద్యశాలలను నిర్లక్ష్యం చేస్తుండటం ప్రైవేట్ ఆస్పత్రులకు వరంలా మారింది. చిన్న జ్వరం వచ్చిన పేషెంట్లు ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాణభయంతో ప్రభుత్వ ఆస్పత్రికి కాకుండా ప్రైవేట్ ఆస్పత్రికే పోతున్నారు. దీంతో ప్రైవేటు డాక్టర్లు తమ ఇష్టం వచ్చినట్లుగా టెస్టులు చేస్తున్నారు. ఎమర్జెన్సీ కేసులు వస్తే ముందే పేషెంట్ బంధువులతో తెల్లకాగితం మీద సంతకం పెట్టించుకుని.. ఆ తరువాత వైద్యం స్టార్ట్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యం స్టార్ట్ చేసి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న దాఖలాలు సైతం ఉన్నాయి. పేషెంట్ బతికితే చాలు అనుకుని రోగులు సైతం వైద్యులు అడిగినంత ఇస్తున్నారు.

## చనిపోయినా కనికరించని యాజమాన్యాలు

ఉమ్మడి జిల్లాకు కరీంనగర్ హాస్పిటల్ జోన్. మిగితా మూడు జిల్లాల నుంచి మెరుగైన వైద్యం కోసం ఇక్కడికే వస్తుంటారు. ప్రధానంగా ఇక్కడే ఆ స్థాయిలో వైద్యం అందుతుందని వారందరి అభిప్రాయం. ఇప్పుడు ఎక్కడ చూసినా మల్టీస్పెషాల్టీ ఆస్పత్రులే కనిపిస్తున్నాయి. కొంతమంది వైద్యులను పెట్టుకుని వ్యాపారవేత్తలు ఆ ఆస్పత్రులను రన్ చేస్తున్నారు. దీంతో వారికి డబ్బులే ప్రధానంగా వైద్యం కొనసాగిస్తున్నారు. ఇదే సమయంలో పరిస్థితి విషమించి రోగి ఎవరైనా మరణించినా యాజమాన్యాలు కనికరం చూపటం లేదు. నిస్సందేహంగా పూర్తి ఫీజు కట్టి శవాన్ని తీసుకెళ్లాలని మృతుల బంధువులకు తెలియజేస్తున్నారు. కాళ్లావేళ్లా పడ్డా కనికరించడం లేదు. దీంతో చేసేదేమి లేక ఆ డబ్బులు కట్టి శవాన్ని తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

## కరోనా సమయంలో పుట్టగొడుగుల్లా..

కరోనా సమయంలో జిల్లాలో పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు వెలిశాయి. డబ్బు సంపాదనే లక్ష్యంగా వ్యాపారులు, వైద్యులు కలిసి కార్పొరేట్‌ను తలదన్నేలా ఆస్పత్రులు ఏర్పాటు చేశారు. మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ బోర్డులు తగిలించుకుని వైద్యం చేస్తున్నారు. వైద్యులు ఆస్పత్రుల్లో లేకపోయినా విజిటింగ్‌పై రప్పిస్తూ రోగులకు చికిత్స చేయించి డబ్బులు దండుకుంటున్నారు. ఇటీవలి తనిఖీల్లో ఇలాంటి ఆస్పత్రులను కూడా గుర్తించారు. గతంలో పనిచేసి వెళ్లిన వైద్యుల పేర్లు వాడుకుంటూ, ఇతర వైద్యులను రప్పించి, రోగులకు అవసరం లేకపోయినా టెస్టుల పేరిట దోచుకుంటున్నట్లు గుర్తించారు. టీఎస్ఎంసీ తనిఖీల్లో బోగస్ ఆస్పత్రుల బాగోతం బయటపడుతోంది. దీంతో లక్షల రూపాయల పెట్టుబడితో నెలకొల్పిన ఆస్పత్రులను కాపాడుకునేందుకు ఆయా ఆస్పత్రుల యజమానులు ప్రయత్నాలు చేస్తున్నారు.

## పట్టించుకోని వైద్యాధికారులు

ప్రైవేట్ ఆస్పత్రులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాల్సిన వైద్యాధికారులు కనీసం పట్టించుకోవటం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రైవేట్ వైద్యశాలలో ఉండాల్సిన సౌలతులు, పరికారలు, వైద్యానికి అయ్యే ఖర్చు వివరాలను పట్టికలో డిస్ ప్లే చేస్తున్నారా లేదా అని పరిశీలించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ ఆస్ర్పతుల యజమాన్యాలు.. వైద్యాధికారులకు ముడుపులు ముట్టజెప్పటం వల్లే వాళ్లు ఏమి మాట్లాడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ ఆస్పత్రులు చేస్తున్న దోపిడీపై నిఘా పెట్టాలని కోరుతున్నారు. ప్రైవేట్ ఆస్ర్పతుల ఫీజులపై ఆంక్షలు విధించాలని కోరుతున్నారు. ఫీజుల నియంత్రణ ద్వారానే సామాన్యులకు వైద్యం అనేది భారం కాదని ప్రజలు అంటున్నారు.



## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

**తెలంగాణ క్యాపిటల్, రామగుండం:** యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధ్వర్యంలో గంజాయి, కల్తీ కల్లు వినియోగంతో జరిగే అనర్థాలపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను సీపీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. వాల్ పోస్టర్‌లో గంజాయి, కల్తీ కల్లు విక్రయాలకు పాల్పడితే ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నంబర్‌తో రూపొందించినట్లు తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి రహిత కమిషనరేట్ కోసం అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఆర్బి ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ జయంతికి తరలిరావాలి

**తెలంగాణ క్యాపిటల్, ఇల్లంతకుంట:** ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఈనెల 14న నిర్వహించే అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాల అంబేద్కర్ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు తరలిరావాలని మండల అధ్యక్షుడు తడకపల్లి భూమయ్య కోరారు. ఆయా గ్రామాలలో ఉదయం 9.30 గంటలకే జయంతి ఉత్సవాలు పూర్తిచేసుకుని మండల కేంద్రానికి తరలిరావాలని కోరారు. అంతేకాకుండా బాబు జగ్జీవన్ రామ్, జ్యోతిబాపూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఒకే నెలలో వస్తున్నందునా.. ఈ ముగ్గురి జయంతి ఉత్సవాలను వల్లంపట్ల గ్రామంలో 14వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సావనపల్లి రాకేష్, సీనియర్ నాయకులు గన్నేరం నర్సయ్య, పసుల వెంకటి, మచ్చ రాజేశం, సావనపెల్లి శంకర్, మల్లమారి బాబు, దమ్మని మధు, బట్టు బాబు, మచ్చ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

POLITICAL NEWS

## కాంగ్రెస్ కార్యదర్శిగా భూమయ్య



**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ టౌన్:** నగరానికి చెందిన మాజీ కార్పొరేటర్ టేల భూమయ్యను జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ఎమ్మెల్యే సత్యనారాయణకు, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్‌కు భూమయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షునిగా నిరంజన్

**తెలంగాణ క్యాపిటల్, ఇల్లంతకుంట:** జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ కమిటీ ఇల్లంతకుంట మండల అధ్యక్షుడిగా సాదుల నిరంజన్ ఎన్నికయ్యారు. జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ళ భద్రయ్య సూచనల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు అన్నాడి సత్యనారాయణ రెడ్డి సాదుల నిరంజన్‌ను నియమించినట్లు పేర్కొన్నారు ఈ సందర్భంగా నిరంజన్‌కు ధ్రువపత్రాన్ని అందజేశారు. తన ఎన్నికకు కృషిచేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అడ్డకి అనిల్ రెడ్డి పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరిక

**తెలంగాణ క్యాపిటల్, రామగుండం:** గోదావరిఖని దుర్గానగర్‌లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్-మానాలి ఠాగూర్ ఆధ్వర్యంలో మాడ నారాయణ రెడ్డి- వాసవి, ఉమ్మడి రామగుండం మాజీ ఎంపీపీ దుర్గం లింగయ్య, ఉమ్మడి రామగుండం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అముల శ్రీనివాస్, చంద్రయ్య, రామన్న, శ్రీనివాస్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నారాయణ రెడ్డి 2001నుండి 2019 వరకు టీఆర్ఎస్ పార్టీలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా 2007 నుండి 2009 వరకు కొనసాగారు. ఉమ్మడి రామగుండం మండల పార్టీ అధ్యక్షుడిగా 5 సార్లు, కొత్తగా ఏర్పడ్డ తర్వాత అంతర్గాం మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా ఒకసారి, 2019 నుండి 2023 వరకు బిజెపి మండల పార్టీ అధ్యక్షుడిగా 2 సార్లు కొనసాగారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, మారేడు పాక రాజి రెడ్డి, దిటి బాల రాజు, సింగం కిరణ్,కోదురు పాక పవన్, మాధవ రావు, పొన్నం సత్తన్న, సతీష్ పాల్గొన్నారు.

## కార్యకర్తలను కలిసిన సంజయ్

**తెలంగాణ క్యాపిటల్ గంగాధర:** గంగాధర మండల కేంద్రంలో ఎంపీ బండి సంజయ్ కుమార్ బీజేపీ కార్యకర్తలను కలిసి వారితో మాట్లాడారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలలో ప్రతి బిజేపీ కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలి ఆయన చెప్పారు. మండలం లో అన్ని గ్రామాల బిజేపీ కార్యకర్తలు కలిసికట్టుగా పార్టీ గెలుపు కొరకు పనిచేయాలని సూచించారు.

# పొన్నం.. గాంధీభవన్ వద్ద దీక్ష చేయ్..

**కేసీఆర్ 10 ఏళ్లపాటు అరిగోస పెట్టినందుకు తెలంగాణ భవన్ వద్ద దీక్ష చేయ్..**

**రూ.500 బోనస్ ఇచ్చిన తరువాతే కొనుగోలు చేయాలి**

**రైతులకు పరిహారం ఎందుకు ఇవ్వడం లేదు?**

**ప్రధాని అభ్యర్థి తెలియని కూటమికి ఎలా ఓటేస్తారు?**

**బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ సంజయ్**

**(తెలంగాణ క్యాపిటల్, వేములవాడ)**



నరేంద్రమోదీ 10 ఏళ్ల పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ.. ఈనెల 14న కరీంనగర్‌లో దీక్ష చేస్తానంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ప్రకటనపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి,ఎంపీ బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో స్పందించారు. 'మోదీ పదేళ్ల పాలనకు నిరసనగా ఎందుకు దీక్ష చేస్తున్నారు...? కరోనా సమయంలో దేశ ప్రజలందరికీ ఉచితంగా వ్యాక్సిన్ ఇచ్చినందుకా..? దేశంలోని 80 కోట్ల మంది పేదలకు ఉచితంగా ఏళ్ల తరబడి బియ్యం ఇస్తున్నందుకా..? కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి రూ.12 వేల కోట్లు నిధులిచ్చినందుకా..? గ్రామాల అభివృద్ధికి నిధులిస్తున్నందుకా..? ఉజ్వల పథకం కింద ప్రజలకు ఉచితంగా సిలిండర్ ఇచ్చి సబ్సిడీ అమలు చేస్తున్నందుకా..? ఏడాదిలో ఏకంగా 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినందుకా..? అయోధ్యలో రామాలయం కట్టినందుకా..? 370 ఆర్టికల్ ను రద్దు చేసి కాశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేసినందుకు నిరసనగా దీక్ష చేస్తారా..? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి కరీంనగర్‌లో అభ్యర్థే కరువయ్యారని.. చేతగాని కాంగ్రెస్ పార్టీ ఓటమి భయంతో తాను ఎంపీగా ఏమీ చేయలేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు కలిసి తనను ఓడించేందుకు కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. పోతారం మాజీ సర్పంచులు జలంధర్, రాజయ్య, ఆలయ చైర్మన్ అశోక్ తదితరులు బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారితోపాటు స్థానిక బీజేపీ నేతలతో కలిసి కథలాపూర్ మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అక్కడున్న సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందని, బీఆర్ఎస్ పోయి కాంగ్రెస్ పాలన వచ్చినా రైతుల పరిస్థితుల్లో మార్పు లేదని అన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 12 రోజులవుతున్నా ఎక్కడా కొనుగోళ్లు ప్రారంభించలేదని అన్నారు. అకాల వర్షాలు, ప్రక్రుతి వైపరీత్యాలను తట్టుకుని పంటలు పండించడం ఒక ఎత్తయితే... పండించిన పంటను అమ్ముకోవడం తలకు మించిన భారంగా మారిందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలను ఎవరూ పట్టించుకోవడం లేదని.. వడ్లు కొంటారో లేదో తెలియడం లేదని అన్నారు. వడ్లను కొనుగోలు కేంద్రాల వద్ద పోసి రోజుల తరబడి పడిగాపులు పడుతున్నా పట్టించుకోవడం లేదని.. ఇన్‌పుట్ సబ్సిడీకి దిక్కు లేదని.. తాలు, తరుగు, తేమ లేకుండద వడ్లు కొంటామని, వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, కానీ ఆ ఊసే లేదని అన్నారు. తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధర ఇవ్వడంతో పాటు 500 బోనస్ ఇచ్చిన తరువాతే వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అండగా ఉండి వారి పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని స్పష్టం చేశారు. 6 గ్యారంటీలను అమలు చేయకపోవడంవల్ల ప్రజలు గ్రామాల్లో ప్రశ్నిస్తున్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జనంలో తిరగలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ మధ్య బీఆర్ఎస్ అభ్యర్థి, అపరమేధావి వినోద్ కుమార్ కరీంనగర్ పార్లమెంటును తానే అభివృద్ధి చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నడని విమర్శించారు. 'పనులు చేసింది నేను. మీరు చేశానని చెప్పుకోవడానికి సిగ్గు లేదా? ఎప్పుడు వచ్చామన్నది కాదు.. బుల్లెట్ దిగిందా? లేదా? అన్నదే ముఖ్యం. పని జరిగిందా? నిధులు తీసుకొచ్చామా? లేదా? ప్రజలకు మంచి జరిగిందా.. లేదా? అన్నదే ముఖ్యం. మీరెన్ని కుట్రలు చేసినా.. బండి సంజయ్ గెలుపు ఆపలేరు' అని వెల్లడించారు.

# సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలి

**రాణిరుద్రమకు రాజకీయాలపై అవగాహన లేదు**

**పొన్నం ప్రభాకర్ రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం**

**ఎంపీగా ఏం చేశారో ప్రజలను అడిగితే చెప్తారు**

**హుస్నాబాద్‌లో గెలుపు ఆయన పనితనానికి నిదర్శనం**

**జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి**

**(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ టౌన్)**



టీవీ యాంకర్‌గా సమాజానికి పరిచయమైన రాణి రుద్రమకు రాజకీయాలపై అవగాహన లేదని.. మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంపీగా పొన్నం ప్రభాకర్ చేసిన అభివృద్ధిపై నియోజకవర్గంలో ఎవరిని అడిగినా చెబుతారని అన్నారు. రాష్ట్ర ఏర్పాటులో ఆయన పోరాటం గురించి నాటి ప్రతిపక్ష నేతలు సైతం కొనియాడిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. పొన్నం పై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. హుస్నాబాద్ నుండి పోటీ చేసి గెలుపొందడం పొన్నం పనితనానికి నిదర్శనమని చెప్పుకొచ్చారు. గతంలో బీజేపీ స్టేట్ చీఫ్‌గా, కరీంనగర్ ఎంపీగా కేంద్రం నిధులతో నియోజక వర్గంలో చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు చూపించాలని డిమాండ్ చేశారు. రూ.48 కోట్లు పన్నుల రూపంలో ప్రజలు కేంద్రానికి చెల్లిస్తే సంజయ్ నియోజకవర్గ ప్రజల కోసం ఎన్ని నిధులు తెచ్చారని ప్రశ్నించారు. ఎంపీగా వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న ఆలయాల అభివృద్ధి కోసం బండి ఎన్ని నిధులు తెచ్చారో రాణిరుద్రమ తెలుసుకోవాలని హితవు పలికారు. తమ పార్టీ అభ్యర్థి ఎంపిక అధిష్టానం చూసుకుంటుందని, అభ్యర్థి ఎవరైనా కరీంనగర్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానేనని వెల్లడించారు. పొన్నంపై అవాకులు చెవాకులు పేలితే ఈ గడ్డపై అడుగు పెట్టలేరని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, డీసీసీ బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి రామిడి రాజిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.సిరాజ్ హుస్సేన్, నేతలు సిరికొండ శివప్రసాద్, కనక రెడ్డి, హైమద్ అలి, చింతల ఎల్లారెడ్డి, జూపాక సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

GENERAL NEWS





# ఉద్రిక్తతల మధ్య భూమి పూజ

## రోడ్డు పైనే గ్రామస్తులు

## ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ డిమాండ్

**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని నర్సింహులపల్లి శివారు ప్రాంతంలో 18 ఏకరాలలో ఏర్పాటు చేసే వైట్ హౌస్ ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులలో భాగంగా శుక్రవారం భూమి పూజ కార్యక్రమం పోలీసుల బందోబస్తు మధ్య, ఉద్రిక్తలతో కొనసాగింది. భూమి పూజ నిర్వహిస్తున్నారని తెలుసుకున్న పలువురు గ్రామస్తులు పిల్లాపాపలతో ఫ్యాక్టరీ ఆవరణకు మూకుమ్మడిగా చేరుకున్నారు. పోలీసులు ఫ్యాక్టరీ ఆవరణకు ఎవరినీ రాకుండా అడ్డుకున్నారు. దాంతో వారంతా రోడ్డుపైనే ఉండిపోవాల్సి వచ్చింది. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య భూమి పూజ కార్యక్రమం ఫ్యాక్టరీ డైరెక్టర్ నరేష్ కుమార్ దంపతులు నిర్వహించారు. మరోవైపు.. రోడ్డుపై మహిళలు ఎంత మొరపెట్టుకున్నా పోలీసులు వినిపించుకోలేదు. భూమి పూజ అనంతరం పోలీసుల జోక్యంతో నరసింహులపల్లికి చెందిన పదిమంది గ్రామస్తులు కంపెనీ ప్రతినిధులైన డైరెక్టర్ నరేష్ కుమార్, హెచ్ఆర్ సివి రావు, మేనేజర్లు విశ్వనాథ్, రామకృష్ణతో సంప్రదింపులు జరిపారు. ఫ్యాక్టరీ వల్ల తమకు తీవ్ర నష్టం జరుగుతుందని.. తమ గ్రామానికి కిలోమీటర్ దూరం కూడా ఫ్యాక్టరీ లేదని.. దాంతో వాయు, జల కాలుష్యం



ఏర్పడుతుందని వేడుకున్నారు. కంపెనీ ప్రతినిధులు మాత్రం అలాంటిదేమీ జరగదని.. కంపెనీ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతానికి మేలు జరుగుతుందని చెప్పుకొచ్చారు. ఈ ప్రాంత వాసులకు ఉద్యోగ, ఉపాధి లభిస్తుందని.. పంటలకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని చెప్పారు. ఇలాంటి కంపెనీ నిర్మించిన ప్రాంతానికి ఇక్కడి వారిని తీసుకెళ్తామని.. ఆ తర్వాతే ఫ్యాక్టరీ నిర్మాణం చేపడుతామని.. అప్పుడు కూడా ఆపాలని కోరితే ఆపేద్దామని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. అప్పటివరకు పనులను ఆపుతామని హామీ ఇచ్చారు. అంగీకరించిన గ్రామస్తులు వెనుదిరిగారు. దుబ్బాక సీఐ పి.శ్రీనివాస్, బెజ్జంకి, కోహెడ, సిద్దిపేట 3వ టౌన్ ఎస్ఐలు కృష్ణారెడ్డి, తిరుపతి, విద్యాసాగర్, పలువురు మహిళా కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించారు.

## గత పాలకుల నిర్లక్ష్యంతోనే

# నిరుపయోగం

**తెలంగాణ క్యాపిటల్, రామగుండం:** నిరుపయోగంగా ఉన్న రామగుండం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వినియోగంలోకి రావాలంటే మార్పులు చేర్పులు చేయాల్సిందేనని, గత పాలకుల నిర్లక్ష్యం వల్లే నిరుయోగంగా మారిందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని షాపింగ్ కాంప్లెక్స్ ని ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ కమీషన్లకు కక్కుర్తి పడి అస్తవ్యస్తంగా నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నేడు వ్యాపారస్తులకు ఎటువంటి ఉపయోగం లేకుండా నిరుపయోగంగా వెలవెలబోతోందన్నారు. నగర మేయర్ బంగి అనిల్ కుమార్, కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు సంబంధిత అధికారులతో షాపింగ్ కాంప్లెక్స్ ని పర్యవేక్షించారు.





## పేషెంట్లకు విజయరమణారావు పరామర్శ

కరీంనగర్ పట్టణంలోని మెడికవర్ ఆసుపత్రిలో ఉన్న పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు పేషెంట్లను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి పేషెంట్ల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని కోరారు. ఆయన వెంట కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిని కలిసిన ప్రభుత్వ విప్

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కేటాయించిన క్వార్టర్స్ లోకి గృహప్రవేశం చేశారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆది శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

## పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

**తెలంగాణా క్యాపిటల్, బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని కల్లెపల్లి గ్రామ అనుబంధ గ్రామమైన ఇటిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇట్టిరెడ్డి కాంతావ (85) కడుపునొప్పి భరించలేక పత్తి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కాంతావ కొద్ది కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పత్తి మందు తాగింది. గమనించిన ఆమె కొడుకు బాల్‌రెడ్డి కోడలు విజయ సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.



## కళాకారులకు ప్రశంసాపత్రాలు

**తెలంగాణ క్యాపిటల్, చిగురుమామిడి:** కొండాపూర్ గ్రామంలో రెండు రోజులుగా గ్రామ కళాకారులతో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ చరిత్ర నాటక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన తెలంగాణ రంగస్థల సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వంగ సుధాకర్, ప్రధాన కార్యదర్శి అలువేలి సమ్మిరెడ్డి కళాకారులందరికీ ప్రశంసాపత్రాలను అందజేశారు. తదుపరి జిల్లా ముఖ్య బాధ్యులకు కొండాపూర్ గ్రామ కళాకారులచే చిరు సన్మానం చేశారు. కార్యక్రమంలో చిగురుమామిడి కళాకారుల కమిటీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి చందబోయిన పరశురాములు, జిల్లా డైరెక్టర్ మాడ రాజిరెడ్డి,మండల కోశాధికారి బింగి లక్ష్మీనారాయణ, కార్యదర్శులు కుతాడి కొమురయ్య,మల్లం బాలయ్య కళాకారులు సంపత్, శంకర్, మల్లేశం, చంద్రారెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, కొమురయ్య, రాజయ్య, జనార్ధన్, పోచయ్య, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## వినోద్ కుమార్ సతీమణి ప్రచారం

**తెలంగాణ క్యాపిటల్, గంగాధర:** కురిక్యాల, నాగిరెడ్డిపూర్, కాచిరెడ్డిపల్లి గ్రామాలలో కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ సతీమణి డాక్టర్ మాధవి ప్రచారం చేశారు. ఎలక్షన్లలో బోయినిపల్లి వినోద్ కుమార్ కారు గుర్తుకు ఓటు వేయాలని ఉపాధి హామీ కూలీలను కోరారు. ఉద్యమం నాటి నుండి తెలంగాణ రాష్ట్రం గురించి కొట్లాడిన వ్యక్తి వినోద్ కుమార్ తెలంగాణ రాష్ట్రానికి నిధులు నియామకాలు తెలంగాణ రాష్ట్రం అవసరాల గురించి పూర్తిస్థాయిలో తెలిసిన వ్యక్తి తెలంగాణ రాష్ట్రం గురించి సమస్యల గురించి మాట్లాడి  పార్లమెంట్ ను స్తంభింపజేసిన వ్యక్తి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు వారి వెంట పాల్గొనడం జరిగింది గంగాధర మండల పార్టీ అధ్యక్షులు మేచినేని నవీన్ రావు పంజాల ఆంజనేయులు పాల్గొన్నారు.



## ఎన్నికల రూల్స్ పకడ్బందీగా అమలు చేయాలి

**కమిషనరేట్ స్థాయి నేర సమీక్షలో సీపీ అభిషేక్ మహంతి**

**(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్)**

కమిషనరేట్ కంప్లయింట్ సెల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టి, అనుగుణంగా చర్యలు తీసుకోవాలని.. ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనరేట్ పోలీసు అధికారులతో కాన్ఫరెన్స్ హాలులో అన్ని విభాగాల అధికారులు, పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో సీపీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులందరికీ పలు కీలక సూచనలు చేశారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. చెక్ పోస్టులు పనితీరుపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలు క్షుణ్ణంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే సంఘ విద్రోహ వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే బైండ్ ఓవర్ కాబడి గడువు ముగిసిన వారిని తిరిగి బైండ్ ఓవర్ చేయాలన్నారు. ఫ్లాగ్ మార్చ్ సమయాల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే జరిగే పరిణామాలను వివరించే సమావేశాల్లో ఆయా ప్రాంతాల్లో వుండే ట్రబుల్ మొంగెర్స్ ని ఉండేలా చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలన్నిటిని సంబంధిత స్టేషన్ల అధికారులు స్వయంగా పరిశీలించాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలన్నారు. సీసీసీ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి క్వాలిటీ డిస్పోస్ చేయాలన్నారు. కమిషనరేట్ కంప్లైంట్ సెల్ ద్వారా పోలీస్ స్టేషన్ లకు పంపించే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిపై తగు చర్యలు తీసుకోవాలని, పరిష్కారం అయ్యే సమస్యల పట్ల నాణ్యమైన విచారణ జరిపి కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, కారణాలను తెలుసుకున్నారు. ఈ సమావేశం లో అడిషనల్ డీసీపీ శాంతిభద్రతలు ఏ.లక్ష్మీనారాయణ, ఏసీపీలు శ్రీనివాస్ (సి.ఎస్.బి), నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్ జీ, , మాధవి, విజయ్ కుమార్, వేణుగోపాల్, కాశయ్య లతో పాటుగా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ

**తెలంగాణ క్యాపిటల్, వేములవాడ:** మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మీగణపతి కాంప్లెక్స్ ముందు, రాజన్న ఆలయ పార్కింగ్, భీమేశ్వర ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలు ట్రస్టు గూగుల్ పే, ఫోన్ పే 89855 88060కు విరాళం అందిస్తే వారి కుటుంబ సభ్యుల పేర అన్నదానం చేయడం జరుగుతుందని నక్క స్వప్న వేణు దంపతులు, ఎన్గల్ వాస్తవ్యులు చేపూరి జ్యోతి రాజు దంపతులు, మారం మహేష్ దంపతులు, శాశ్వత దాతలుగా జువ్వాడి స్నేహలత వెంకటేశ్వరరావు దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు ఉన్నారని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.



# బీఆర్ఎస్‌కు కరీంనగర్ పుట్టినిల్లు

**రెండు సార్లు కేసీఆర్ రాజీనామా చేసినా భారీ మెజారిటీతో గెలిపించారు**

**పదేళ్ల మా పాలనలో కరీంనగర్ అభివృద్ధి చెందింది**

**కరీంనగర్-మనోహరాబాద్ రైల్వేలైన్ వినోద్ తెచ్చారు**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు**

**(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్)**



బీఆర్ఎస్ పార్టీకి కరీంనగర్ పుట్టినిల్లులాంటిదని.. రెండుసార్లు కరీంనగర్ ఎంపీగా కేసీఆర్ రాజీనామా చేసినా భారీ మెజార్టీతో మళ్లీ గెలిపించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. శుక్రవారం రాంనగర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం 32 రాజకీయ పార్టీలను ఒప్పించడంలో వినోద్ కుమార్ కీలకపాత్ర పోషించారని.. అర్హత లేకున్నా కరీంనగర్ కు స్మార్ట్ సిటీ తెచ్చిన ఘనత వినోద్ కుమార్ దేనని కొనియాడారు. ఐదేళ్లలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఏం చేశారని.. పదేళ్ళలో బీజేపీ ఏం చేసిందని నిలదీశారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలో నిరుద్యోగం పెరిగిందని.. సంజయ్ కనీసం మెడికల్ కాలేజీ, నవోదయ పాఠశాల కూడా తేలేదని అన్నారు. పదేళ్ళలో బీజేపీ ఒక్క మంచి పతకం తేలేదని, పేదల కోసం చేసింది చెప్పమంటే క్యాలెండర్లు, చిత్రపటాలు పంచుతున్నారని పేర్కొన్నారు. క్యాలెండర్ కడుపునింపుతున్నదా.. చిత్రపటం ఆకలి తీరుస్తోందా అని నిలదీశారు. కాంగ్రెస్ వచ్చిన నాలుగు నెలల్లోనే కరీంనగర్ లో తాగునీళ్లు దొరకడం లేదని.. ఆ పార్టీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారని.. ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ వాళ్లు బాండు పేపర్లు రాసిస్తితిరి ఏమైందని అడిగారు. కరీంనగర్ ఎంపీగా ప్రశ్నించే గొంతుకగా అయ్యే వినోద్ కుమార్ ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే ప్రజలు మోసపోతారని అన్నారు. కాంగ్రెస్ వాళ్లు సొల్లు మాటలు.. అబద్ధాలు చెపుతున్నారని అన్నారు. గ్రామాల్లో పంటలు.. కరీంనగర్ లో ప్రజల గొంతు ఎండుతోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఏమైనా చెడ్డి గ్యాంగ్ సభ్యుడా అని ప్రశ్నించారు. కరీంనగర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి.. సీఎం రేవంత్ రెడ్డికి కేసీఆర్ లేకుంటే కుర్చీ ఎక్కడిదని అన్నారు. జై తెలంగాణ అనే వాళ్ళను తుపాకీతో బెదిరించిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని.. కాంగ్రెస్ మాటలన్నీ ఉద్దెర మాటలని పేర్కొన్నారు. బడేభాయ్.. చోటేభాయ్ ఒక్కటయ్యారని.. కరీంనగర్ లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని అన్నారు. ఈ రెండు పార్టీలు చీకటి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. కరీంనగర్ కు వెయ్యి కోట్లతో స్మార్ట్ సిటీ, మానేరు నదిపై తీగల వంతెన నిర్మాణంతో పాటు మానేరు రివర్ ఫ్రంట్, ఐటీ టవర్ తీసుకొచ్చానన్నారు. కరీంనగర్ చుట్టూ పక్కల జాతీయ రహదారులు, కొత్తపల్లి-మనోహరబాద్ రైల్వే లైన్, తీగలగుట్టపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జికి నిధుల మంజూరు చేయించి, నిర్మాణం, అంబేద్కర్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణం, కరీంనగర్ లో 25 కోట్లతో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మాణం, కొండగట్టు ఆలయానికి 332 ఎకరాల ఫారెస్టు భూమిని కేటాయించడం జరిగిందని చెప్పారు. కరీంనగర్ కు ట్రిబుల్ ఐటీ తీసుకురావడంలో బండి సంజయ్ విఫలమయ్యారని అన్నారు. వేములవాడ, కొండగట్టు ఆలయాలకు ఐదు రూపాయలు తీసుకురాలేదని పేర్కొన్నారు. ప్రజల మనోభావాలతో సంజయ్ ఓట్ల రాజకీయం చేస్తున్నాడని, కేంద్ర ప్రభుత్వ పథకాలకు వచ్చే నిధులు బండి సంజయ్ తెచ్చినట్లు చెప్పుకోవడం హాస్యస్పదమని అన్నారు. ప్రజలు ఆశీర్వదించి పార్లమెంట్ కు పంపిస్తే ప్రశ్నించే గొంతునవుతానని స్పష్టం చేశారు.

## పెద్దపల్లిలో కొప్పుల ప్రచారం

**తెలంగాణ క్యాపిటల్, పెద్దపల్లి:** పెద్దపల్లి పట్టణంలో ఎంపీ ఎన్నికల సందర్భంగా ప్రచారంలో భాగంగా జెండా చౌరస్తా వద్ద పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతా రెడ్డి, మహిళా నాయకురాలు దాసరి ఉష, పెద్దపల్లి పట్టణాధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, ఎంపీపీ బండారి స్రవంతి-శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు మార్కు లక్ష్మణ్, గౌరవ కౌన్సిలర్లు, యువకులు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ క్యాపిటల్ పేపర్‌లో వార్తల కోసం ఈ నంబర్‌లో సంప్రదించగలరు : 92949 92992